క్లుప్తంగా

నేడు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు

రేపల్లె రూరల్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈనెల 2న సోమవారం ఉదయం 10.30 గంటలకు డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటరు వరకు ర్యాలీ నిర్వహించి అక్కడి వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తామని, కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ స్తంభాలను మార్చాలి



రేపల్లె రూరల్: పిరాట్లంక గ్రామంలో విద్యుత్ స్తంభాలను మార్చాలని కమతం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ సాంబశివరావు కోరారు. భారీ వర్షాలకు పిరాట్లంక గ్రామంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో ఆయన విద్యుత్ సిబ్బందిని అప్రమత్తం చేసి ఆదివారం గ్రామంలో మరమ్మతులు చేయించారు. గ్రామంలో 42 ఏళ్ల క్రితం విద్యుత్ స్తంభాలు వేశారని, వీటిని మార్చాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కమతం రమాదేవి, ఫౌండేషన్ సభ్యులు కమతం విజయకుమారి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో పారాయణం

భట్టిప్రోలు: భక్తి నవ విధాలుగా ఉంటుందని శుక్రవారోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి బూర్లె అరుణ కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలులో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆదివారం గ్రామానికి చెందిన పాతూరి కాంతారావు శర్మ-శ్రీవల్లీ దంపతుల స్వగృహంలో పారాయణ కార్యక్రమం జరిగింది. ఆమె పలు అంశాల గురించి ప్రబోధించారు. కార్యక్రమంలో కె.రాజేష్-నీరజ, కమిటీ సభ్యులు శ్రీజ, శైలజ, కన్యాకుమారి, సూర్యప్రభ, అరుణ, పార్వతి, ధనలక్ష్మి,నళినీ, శ్రీవాణి, గృహలక్ష్మి, హేమ పద్మ, శశి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అడెమ్మ తల్లికి సామూహిక పూజలు



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి గ్రామ దేవత అడెమ్మ తల్లిని ఆదివారం పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు సామూహికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సంఘీయులు మొక్కుబడులు చెల్లించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్ల మధ్య ఊరేగింపుగా సంఘీయులు అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.

రేపు తెనాలి ఐటీఐలో జాబ్‌మేళా

తెనాలిఅర్బన్: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం తెనాలి చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి చినవెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. మేళాలో ఆపిక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, బుక్ ఎక్స్‌పర్ట్, క్యాప్‌స్టాన్ సర్వీస్ లిమిటెడ్ తదితర కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్, డిప్లమో పూర్తిచేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు.

ఆహార నియమాలతో మూత్రపిండాలు క్షేమం

తెనాలి: తగినంత వ్యాయామం, ఆహార నియమాలతో మూత్రపిండాలు చక్కని పనితీరును కనబరుస్తాయని గుంటూరుకు చెందిన మూత్రపిండాల వ్యాధుల నిపుణుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్ చెప్పారు. రక్తంలోని మలిన పదార్థాలను మూత్రం ద్వారా విసర్జిస్తూ రక్తాన్ని శుభ్రపరిచే మూత్రపిండాలు జాగ్రత్తగా ఉండేలా చూసుకోవటం తప్పనిసరిగా చెప్పారు. వాకర్స్ క్లబ్, తెనాలి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజపార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటైన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'మూత్రపిండాల వ్యాధులు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై డాక్టర్ ఆవుల శ్రీనివాస్ అవగాహన కల్పించారు. మూత్రపిండాలు వైఫల్యం చెందితే ఉబ్బు కామెర్లు, మూత్రకోశంలో రాళ్లు ఏర్పడతాయని చెప్పారు. మధుమేహం, అధిక రక్తపోటుతో మూత్రపిండాలు దెబ్బతింటే డయాలసిస్ చేయాల్సిన అగత్యం ఏర్పడుతుందన్నారు. అందుచేత ఎవరికివారు దైనందిన జీవితంలో నిత్యవ్యాయామం చేస్తూ, వయసుకు తగిన ఆహారం తీసుకుంటే మూత్రపిండాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదనీ, ఆరోగ్యకరంగా జీవించవచ్చని వివరించారు. సభలో డాక్టర్ ఆవుల శ్రీనివాస్, వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తిని సత్కరించారు. కార్యదర్శి కడియాల రవిబాబు, అశోక్‌కుమార్, డాక్టర్ అబ్బయ్య, రత్తయ్య, మొవ్వా సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దినదిన గండం

కృష్ణమ్మ ఉగ్రరూపం

- పరీవాహక ప్రాంతాల్లో బీభత్సం
- లోతట్టుప్రాంతాలు జలమయం
- నీట మునిగిన వాణిజ్య పంటలు

కృష్ణానది వరద ఉధృతి రోజురోజుకూ పెరుగుతోంది. భారీ వర్షాలతోపాటు ఎగువ నుంచి వస్తున్న నీటితో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. నదీపరీవాహక ప్రాంతాలను ముంచెత్తుతోంది. పంటలను మింగేస్తోంది. ఆదివారం రాత్రికి ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల 9.3 లక్షలకు చేరడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. లంక గ్రామాలు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు. అధికారులు, నాయకులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు ధైర్యం చెబుతున్నారు. పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కొల్లూరు/భట్టిప్రోలు/వేమూరు/చెరుకుపల్లి/పిట్టలవానిపాలెం/కర్లపాలెం/నిజాంపట్నం/బాపట్ల: భట్టిప్రోలు మండలంలోని కృష్ణా నదీ పరీవాహక లంక గ్రామాల్లోకి వరద నీరు చొచ్చుకొచ్చింది. అరటి, కంద, పసుపు, కూరగాయలు, తమలపాకుల పంటలు నీటమునిగాయి. చప్టాలపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెల్లటూరు చినరేవునూ వరద నీరు చుట్టుముట్టింది. లంక గ్రామాల వాసులు వెల్లటూరు హైలెవల్ వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు లంక గ్రామాల్లో పర్యటించారు. బాధితులను పునరావాస కేంద్రాలకు రావాలని కోరుతున్నారు. రివర్ కన్జర్వేషన్ డీఈ టి.భానుబాబు ఆధ్వర్యంలో ఏఈలు నాగేశ్వర్ నాయక్ కరకట్టల పటిష్టత పనులు చేయిస్తున్నారు. బాపట్ల ఆర్డీఓ జి.రవీంద్ర భట్టిప్రోలు మండలంలోని లంకగ్రామాల్లో పర్యటించారు. నాటు పడవలతో నదిలో ప్రయాణించవద్దని సూచించారు. నదిలోకి ఎవరూ వెళ్లొద్దని హెచ్చరించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



పెసర్లంక-ఆవులవారిపాలెం గ్రామాల మధ్య వరద ప్రవాహం



కొల్లూరు మండలం ఆవులవారిపాలెం వద్ద వరదనీటి ఉధృతి

పునరావాస కేంద్రాలకు బాధితులు



వేమూరు: వేమూరు మండలంలో ఇళ్లల్లోకి నీరు చొచ్చుకెళ్లడంతో బాధితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వేమూరు అంబేడ్కర్ నగర్ పునరావాస కేంద్రంలో 37 మంది తలదాచుకున్నారు. తహసీల్దార్ బి.సుశీల కేంద్రాన్ని పరిశీలించారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు, చుండూరు మండలంలోని దుండిపాలెం, వలివేరు గ్రామాల్లోనూ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు.



భట్టిప్రోలు మండలం ఓలేరు పల్లెపాలెం వద్ద వరద ఉధృతితో నిలిచిన పడవలు



వెల్లటూరు చినరేవును చుట్టుముట్టిన వరద నీరు

ప్రభుత్వం అండగా ఉంటుంది



వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో ఆయన పర్యటించారు. అరవింద వారధి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. సహాయక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎంపీ పర్యటన



భట్టిప్రోలు మండలంలోని లంక గ్రామాలను ఆదివారం బాపట్ల పార్లమెంట్ సభ్యులు, లోక్‌సభ ప్యానల్ స్పీకర్ తెన్నేటి కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. పునరావాస కేంద్రాలకు తరలి రావాలని కోరారు. సహాయక చర్యలపై అధికారులను ఆదేశించారు. వెల్లటూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, అధికారులు ఉన్నారు.

పిట్టవానిపాలెం మండలంలో ముంపు



పిట్టలవానిపాలెం మండలం చోడిపాలెంలో చెరువులను తలపిస్తున్న పొలాలు



పిట్టలవానిపాలెంలో ఇళ్ల మధ్య వర్షపు నీరు

పిట్టలవానిపాలెం: పిట్టలవానిపాలెం మండలంలోని పలు గ్రామాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్ల మధ్య నీరు చేరింది. బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్ ఖాజీపాలెం శివారు ఎస్టీ కాలనీలో పర్యటించారు. కాలనీ వాసులకు ధైర్యం చెప్పారు. 400 ఎకరాల పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.



చందోలులో దుస్థితి



భట్టిప్రోలు హైస్కూల్ పునరావాస కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం



వరద ఉధృతికి మునిగిన పసుపు పంట

రైతులను ఆదుకుంటాం



భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. ఆదివారం ఎమ్మెల్యే కర్లపాలెం మండల పరిధిలోని పలు గ్రామాలలో పర్యటించి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతులు తమ గోడు ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మి, ఏఓ సుమంత్‌కుమార్ నాయకులు భూపతి రావు, వెంకటస్వామి, బాజీ, పఠాన్, వసంతరెడ్డి తదితరులు ఉన్నారు.

నీట మునిగిన వరి నాట్లు

నిజాంపట్నం: భారీ వర్షాలకు నిజాంపట్నం మండలంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. పొలాల్లో వరి నాట్లు నీటమునిగాయి. పొలాల్లో నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు పాట్లు పడుతున్నారు.

గుళ్లపల్లి కాలువలో పూడికతీత



చెరుకుపల్లి: వర్షాల వల్ల ముంపునకు గురైన వరి పొలాల్లో నీటిని బయటకు పంపేందుకు గుళ్లపల్లి రైతులు ఆదివారం శ్రీకారం చుట్టారు. గుళ్లపల్లి కాలువలో పూడిక తీత చేపట్టారు. గ్రామ నాయకుడు ఉప్పాల సాంబశివరావు చొరవతో జేసీబీతో పూడిక తీశారు. కార్యక్రమంలో గ్రామ రైతులు కందుల శ్రీనివాసరావు, ఈపూరి బుజ్జి, యడవల్లి శ్రీనివాసరావు, వీర రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.



ఈపూరులంక పొలాల్లో మోటార్‌ను ఇంటికి చేర్చుతున్న రైతులు



ఈపూరులంక వద్ద వరద నీట మునిగిన పసుపు పంట



గాజుల్లంక దగ్గర దుస్థితి ఇదీ..



కొల్లూరు మండలం ఆవులవారిపాలెం వద్ద వరద నీటిలో మునిగిన ఇటుక బట్టీలు



కొల్లూరు మండలం పెసర్లంక వద్ద గ్రామంలోని గృహాలను చుట్టుముట్టిన వరద నీరు



నిజాంపట్నం మండలం పల్లపట్లలో నీట మునిగిన వరి మొక్కలను పరిశీలిస్తున్న ఏఓ శారద



కొల్లూరు మండలం లంక గ్రామాల నుంచి సామగ్రితో సురక్షిత ప్రాంతానికి ట్రాక్టర్‌పై వెళ్తున్న కుటుంబం



భట్టిప్రోలు మండలం వేమవరంలో చెరువులను తలపిస్తున్న పంటపొలాలు



కొల్లూరు మండలం చిలుమూరులంక వద్ద వరద నీట మునిగిన అరటి తోట